


(గత సంచిక తరువాయి)

**"మన గ్రహ భవిష్యత్తు** వాడి చేతిలో పెట్టమంటారా?" అని భీష్మ వంక చూసాడు.

"ఒకప్పుడు యూత్ వేరు, ఇప్పుడు యూత్ వేరు, దేనికి ఎంత ఇంపార్టెన్స్ ఇవ్వాలో వాళ్లకు బాగా తెలుసు. నామాట విని ద్రోణా చెప్పినట్టు చేయండి" అన్నాడు.

వశిష్ఠ దానికి ఒప్పుకుని అదే విషయం వంశీకి చెప్పాడు.

హాల్లో టీవీ దగ్గరున్న విరించికి అకస్మాత్తుగా ఓ అనుమానం వచ్చింది. వెనక్కి తిరిగి ఆర్యాతో, "సర్!! ఇక్కడ మీరు పోలీస్ కదా? ఆ గ్రహం మీద మీరు దొంగనా?" అని నవ్వాపుకుంటూ అడిగాడు.

ఆర్యా, "ఈ ప్రశ్న తర్వాత నేను గట్టిగా ఒక గుద్దు గుద్దుతాను. నువ్వు ఇక్కడ పోతావో అక్కడ పోతావో చూద్దామా?" అని కోపంగా చూశాడు.

విరించి, 'అమ్మో!!' అనుకుని తలను టీవీ వైపు తిప్పాడు.

చీకటి పడింది.,

విరించి నిద్రపోయాడు. వశిష్ఠ మిగిలిన వారితో కలిసి షిప్ ముందు భాగంలో కూర్చున్నాడు. సముద్రం నుండి చల్లటి గాలి అందరి మొహాలను తాకుతూ ఉంది.

ద్రోణా ఆకాశం వంక చూస్తూ, "మా గ్రహం ఎలాంటి పరిస్థితిలో ఉందో....?!" అన్నాడు.

వశిష్ఠ, "పరమేశ్వరుడు ఒకచోట తీస్తే మరోచోట కలుపుతాడు ద్రోణా., ఏదీ మనచేతుల్లో లేదు. కాలానికి ఎదురు వెళ్లడం అగస్త్య చేసిన పెద్ద తప్పు. దానికి ప్రతిఫలమే ఈ వినాశనం. నేను కూడా ప్రకృతి పరంగా మా గ్రహం నాశనమవుతుందంటే కచ్చితంగా ఎదురెళ్లి పోరాడతాను కానీ, మరొక గ్రహాన్ని నాశనం చేసే ప్రయత్నం మాత్రం చేయను. ఇప్పుడు కూడా నేను ఈ టైం ఎనలైజర్‌ను కనిపెట్టింది కేవలం భూమ్మీద కాలక్రమంలో వస్తున్న మార్పులు అధ్యయనం చేసి, బెర్ముడా ట్రయాంగిల్ లాంటి ప్రదేశాల్లో ఎందుకని పెద్దపెద్ద ఓడలు, విమానాలు మాయమవుతున్నాయో

కనిపెట్టడానికే తప్ప, కాలానికి ఎదురెళ్లడానికి కాదు. అగస్త్య ఆ పోర్టల్స్ వల్ల వచ్చిన వినాశనాన్ని గుర్తించాడు. దాన్ని ఆపే క్రమంలో ఎన్నో తప్పులు చేశాడు. ఇప్పుడు చూడు,, తన గ్రహం అంతం కావడానికి పరోక్షంగానే తానే కారణం అయ్యాడు. తన తప్పు తెలుసుకుని ఆపే ప్రయత్నం చేయడం చాలా మంచిది. కానీ ఏ సంబంధం లేని ఈ మా గ్రహాన్ని నాశనం చేయడం సమంజసం కాదు" అని అగస్త్య మీద తనకున్న అభిప్రాయం చెప్పాడు.

వశిష్ఠ చెప్పిన మాటలు అన్నింటిని తాను సమ్మతిస్తూ ద్రోణా, "మీతో గడిపిన క్షణాలు చాలా గొప్పవి వశిష్ఠా..! వయసులో చిన్నవాడివే అయినా నీ విజ్ఞత చాలా గొప్పది. ఖచ్చితంగా నువ్వు రానున్న మరో పదేళ్ళలో ఈ భూమ్మీద వచ్చే టెక్నాలజీకి నాంది పలుకుతావు. నీ తల్లిదండ్రులు అదృష్టవంతులు. గొప్పబిడ్డకు జన్మనిచ్చారు" అన్నాడు.

అంతా వింటూ మనసులో, 'వశిష్ఠను ద్రోణా ఇంతలా ఎందుకు పొగుడుతున్నాడు..?' అనుకున్నాడు ఆర్యా.

అంతలో భీష్మ ఫోన్ బ్రౌజింగ్ చేస్తూ, "ఇండియా టైమింగ్  బెర్ముడా కంటే తొమ్మిది గంటలు ముందుంది. నేను కూడా కాలంలో ప్రయాణం చేశాను" అని నవ్వుతూ వాతావరణం మార్చే ప్రయత్నం చేశాడు.

వశిష్ఠ, "అవును టెక్నికల్‌గా మీ అందరూ టైం ట్రావెల్ చేసినట్టే....!!" అని చిన్న నవ్వు నవ్వాడు.

"ఇదే విషయం మాకు ద్రోణాగా వచ్చిన అగస్త్య చెప్పాడు. అప్పుడు అవును కదా అనిపించింది" అని ఆర్యా మాటలు కలిపాడు.

భీష్మ, "ఆర్యా సాలిడ్ పోలీస్ ఆఫీసర్., ఎన్నోసార్లు తన ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు ఇలాగే. గట్టి మనిషి., ప్రమాదం ఏదైనా అలా ఎదురెళ్లిపోతాడంతే.." అని గర్వంగా చెప్పాడు.

వశిష్ఠ, "అతని ధైర్యం ఆరోజు నేను చూశాను కదా? మీవాడికి గానీ ఆ కత్తిపోటు పడకపోయుంటే మాత్రం అసలైన ద్రోణాకు ఆర్యాకు మధ్య ఓ మినీ యుద్ధమే జరిగేది. ఇలాంటి వాళ్లే దేశానికి కావాలి" అన్నాడు.

ఈలోగా వంశీ నుండి మెసేజ్ వచ్చింది. మెసేజ్ చదివి, "వంశీ సెటప్ అంతా సిద్ధం చేశాడు. మనం రెండు సైడ్స్ నుండి సిద్ధంగా ఉన్నాము. ఇక ఆ భద్రా కోసం ఎదురుచూడాలి" అన్నాడు వశిష్ఠ.

"భద్రా!! గొప్ప శాస్త్రవేత్త, ఎవరి సాయం లేకుండా ప్రభుత్వంలో మంచి హోదాలోకి వచ్చాడంటే అది అతని నైపుణ్యమే. కానీ తానేందుకని ఇంత మూర్ఖంగా ప్రవర్తిస్తున్నాడో అర్థం కావడం లేదు. అతని విచక్షణకు కుటుంబం అడ్డొస్తుందేమో..? లేదా అగస్త్యను చూసి భయపడ్డాడా?" అని ద్రోణా అన్నాడు.

వశిష్ఠ, "అక్కడ గ్రహమే లేకుండా పోయే పరిస్థితి వచ్చింది.., భద్రా అతనికి భయపడే అవకాశమే లేదు. కాబట్టి, వాళ్ళిద్దరి మధ్యా బాండింగ్ కేవలం ట్రస్ట్ మాత్రమే" అన్నాడు.

ద్రోణా, “అయ్యుండచ్చు., నేను కూడా అతన్ని అగస్త్యకు వ్యతిరేకంగా మార్చాలనుకున్నాను. కానీ, అతనికి అగస్త్య మీదున్న నమ్మకం ముందు ఓడిపోతాననిపించింది” అన్నాడు.

ఆర్యా, “అంతలా నమ్మే మిత్రుడు దొరకడం అగస్త్య అదృష్టం, మన దురదృష్టం” అని నవ్వాడు.

వెనుకనే అందరూ నవ్వారు.

వశిష్ఠ, “మీరు మాట్లాడుతూ ఉండండి,. నేను లోపలికెళ్లి వస్తాను” అని ల్యాబ్‌లోకి వెళ్ళిపోయాడు.

వశిష్ఠ వెళ్లిపోయాడని నిర్ధారణ చేసుకుని, “ఆర్యా!! ఆరోజు పేలుడు జరిగినప్పుడు నేనూ, వశిష్ఠ అక్కడే ఉన్నామని నీకు తెలుసు కదా..?” అనడిగాడు ద్రోణ.

“అవును తెలుసు!!!” అని సమాధానం చెప్పాడు ఆర్యా.

“ఆరోజు వశిష్ఠ నన్ను కాపాడాడు., నన్నే కాదు అగస్త్యను కాపాడాలనుకున్నాడు. కానీ అగస్త్య టైం లూప్‌లో చిక్కుకున్నాడు. నన్ను అతని షిప్ లోకి తీసుకెళ్లిన తర్వాత నన్ను చాలా జాగ్రత్తగా చూసుకున్నాడు. అలాగే తాను మొదట అగస్త్యను చూసిన సమయం నుండే మా గ్రహాన్ని ఎలా కాపాడాలోనని వర్కౌట్ చేయడం స్టార్ట్ చేశాడు. అతని అనాలిసిస్ నన్ను ఆశ్చర్యపరిచింది. మేము ఎన్నిరకాలుగా ప్రయత్నం చేశామో అన్నిరకాల ప్రత్యామ్నాయ పద్ధతులు నాకు చెప్పాడు. కానీ, అవన్నీ ప్రాక్టికల్‌గా వర్క్ అవవని చెప్పాను. తాను ఖచ్చితంగా వేరొక మార్గం ఉంటుందని తన వర్క్ కొనసాగించాడు. చివరివరకూ అగస్త్యను చంపకుండా రెండు గ్రహాలను కాపాడాలని చూశాడు. కానీ అగస్త్య, తాను అందుకు అర్హుడు కాదని పదేపదే నిరూపించాడు. అందుకే తప్పక ఈ నిర్ణయం తీసుకున్నాడు. అందుకే నా మనసులో ఉన్న అభిప్రాయం బయటపెట్టాను. ఈ విషయం నీకెందుకు చెబుతున్నా అంటే నా మాటలకు నీ మొహంలో వచ్చిన మార్పులు నేను గమనించాను. అందుకే నావైపు నాకున్న కారణాలు చెప్పాను”

“వశిష్ఠ గురించి నేను కూడా చాలా పాజిటివ్‌గా చదివాను. అతనొక గొప్ప శాస్త్రవేత్త మాత్రమే కాదు, చిన్న వయసులోనే గొప్ప ఫిలాసఫర్. అతని ఆలోచనా కోణం మనందరి కంటే చాలా భిన్నంగా ఉంది. అతని మొహం మీద ఉండే చిన్న చిరునవ్వు నాకు భలే నచ్చింది. కానీ, నేరుగా చూసినప్పుడు అతని మొహంలో ఆ నవ్వు జాడలేదు. బహుశా..!! నేను అతడిని రాంగ్ టైంలో కలిశానేమో? నాకు అతని సామర్థ్యం మీద నమ్మకం లేక కాదు, మాకు ఏలియన్ అయినా నువ్వు అంతలా వశిష్ఠను ఎందుకు పొగిడావో అర్థం కాక అలా చూశాను. ఇప్పుడు ఆ అనుమానం కూడా లేదు” అనన్నాడు ఆర్యా. భీష్మకు ఇద్దరి అభిప్రాయాలు, వశిష్ఠ మీద మరింత నమ్మకం పెంచాయి.

ఆ తర్వాత ముగ్గురూ సముద్రం వంక చూస్తూ అలానే నిద్రపోయారు. కొద్దిసేపటి తర్వాత బయటకొచ్చిన వశిష్ఠ అందరినీ చూసి అందరి మీద దుప్పట్లు కప్పి తాను కూడా అక్కడే వాళ్ళతో పాటు పడుకున్నాడు.

పసిఫిక్ మహాసముద్రం మధ్యభాగంలో ఒకచోట.,

వేగంగా వెళ్తున్న వాణిజ్య నౌక ఒక పెద్ద కుదుపునకు లోనైంది. అప్పటివరకూ ప్రశాంతంగా ఉన్న జనాలు ఒక్కసారిగా భయభ్రాంతులకు లోనయ్యారు. ఆ కుదుపు తగ్గేలోపు మరొక రెండు పెద్ద కుదుపులు వచ్చి, వేగంగా కొండను ఢీ కొట్టుకున్నట్టుగా నౌక అకస్మాత్తుగా ఆగింది. ఇంజన్స్ ఎంత వేగంగా పనిచేసినా ఒక్క అంగుళం కూడా కదలడం లేదు. నౌకా సిబ్బంది బయటకు వచ్చి నౌక చుట్టూతా చూస్తూ ముందు భాగంలో చూసిన దృశ్యానికి ఆశ్చర్యానికి లోనయ్యారు. ఒకరి తర్వాత మరొకరు ఆశ్చర్యం నిండిన కళ్ళతోనే ఫోటోలు తీస్తూ, వీడియోలు తీస్తూ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. వారి ఎదుట అతి పెద్దచేప తేలియాడుతూ ఉంది. ఆ చేప చనిపోయిందనుకుని దానిమీదకు బల్లెం లాంటి ఆయుధాలు వేసి పరీక్షించారు. దాడి చేసిన కొన్ని క్షణాలకు సముద్ర ఉపరితల నీటికి కొన్ని అడుగుల దూరంలో తెరచుకున్న అతిపెద్ద కన్ను వాళ్ళకి కనబడింది. అందరూ భయంతో ఒక్క అడుగు వెనక్కి వేశారు. ఆ జీవి అమాంతం ఉపరితలం నుండి అగాథంలో వెళ్ళిపోయింది. ఆ అలలకు ఆ నౌక పెద్ద కుదుపులకు లోనైంది.

యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాకు, కెనడాకు మధ్యనున్న సరిహద్దు వద్ద..,

సరిహద్దులో రౌండ్స్‌కు వెళ్లిన అమెరికా ట్రక్ ఒకటి చెడిపోయి మధ్యలో ఆగింది. దానిలో ఉన్న సోల్జర్స్ ట్రక్కు దిగి, కొందరు ట్రక్కును ప్రొటెక్ట్ చేస్తుంటే మరో ఇద్దరు ట్రక్కును రిపేర్ చేసే పనిలో ఉన్నారు. సమయం మెల్లిగా గడిచింది. ఒక సోల్జర్ చేతిలో ఉన్న గన్ వీపు మీదకు మార్చుకుని నీళ్లు తాగుతూ కొన్ని అడుగులు ముందుకేశాడు. దూరంగా ఒక పెద్ద వెలుగు కనిపించింది. బాటిల్ కిందపాడేసి చేతిలోకి గన్ తీసుకుని, అనుమానంగా అటువైపు చూశాడు. భూమి మీద నుండి దుమ్ము లేవడం ఆరంభించింది. అతనికి అక్కడేం జరుగుతుందో అర్థం కాక, ఫెన్స్‌కు మరింత దగ్గరకు వెళ్లి చూశాడు. కొన్ని వందలమంది సైనికులు కవాతు చేసుకుంటూ నేరుగా వారి వైపు రావడం కనబడింది. వెంటనే మిగతా వాళ్ళని అలెర్ట్ చేసి, హైయ్యర్ ఆథారిటీస్‌కు సమాచారం ఇస్తూ, కెనడా వాళ్ళు యుద్ధానికి వస్తున్నారని చెప్పాడు. ఈలోగా వాళ్ళు తక్షణ కర్తవ్యం కిందా వాళ్లమీద తూటాల వర్షం కురిపించారు. ఆశ్చర్యంగా ఒక్క తూటా కూడా వాళ్ళకి తగలకుండా మధ్యలోనే మాయమయ్యాయి. అందరూ ఒక్కసారిగా విస్మయానికి లోనయ్యారు. ఒక సోల్జర్ తన వద్ద బైనాక్యులర్ సాయంతో వాళ్ళని నిశితంగా గమనించాడు. వారి యూనిఫారం కెనడా ఆర్మీది కాదని అర్థమై, దాని మీదున్న సింబల్స్, ప్యాటర్న్స్ గీయడం మొదలెట్టిన కొన్ని క్షణాలకు వందల కొద్ది వచ్చిన సైన్యం ఒక్కసారిగా కనుమరుగైంది. సైనికులకు ఏం జరిగిందో అంతు పట్టలేదు. అదే సమాచారాన్ని పైకి అందించారు.

ఎవరెస్టు శిఖర ప్రాంతం.,

శిఖరాన్ని అధిరోహిస్తున్న పర్వతారోహకులు సేద తీరడం కోసం శిఖరాగ్రానికి కొన్ని వందల అడుగుల దూరంలో ఆగారు. కాళ్లకు, చేతులకు అధిక రక్త ప్రసరణ జరిగేలా వాటిని ఆడిస్తూ, ఒకరితో మరొకరు మాట్లాడుకోవడం ఆరంభించారు. కొద్ది సమయానికి వారిలో ఒకతను కళ్లకున్న గాగుల్స్ తీసి, దానిమీద పట్టిన మంచును తుడిచాడు. వాటిని పెట్టుకోబోతూ దానిలో వచ్చిన రిఫ్లెక్షన్ వంక ఆశ్చర్యంగా చూస్తూ వెనక్కి తిరిగి చూశాడు. ఒక్కసారిగా మొహం మీదకు వేడిగాలి తగిలింది. అతని కళ్ళు ఒక్కసారిగా పెద్దవయ్యాయి. అతని కళ్ళలో ఓ వెలుగు ప్రస్ఫుటంగా కనిపించింది. చుట్టూ వున్న వారి భుజాల మీద చేతులు వేసి అటుగా తలలు తిప్పమని సైగ చేశాడు. మిగతావాళ్ళు కూడా వెనక్కి తిరిగి చూశారు. వాళ్లది కూడా అతని పరిస్థితినే. వాళ్ళ ఎదురుగా ఓ పెద్ద అంతరిక్షనౌక ఉంది. దాని ఇంజన్ నుండి వస్తున్న అగ్ని సెగ వాళ్ళను తాకింది. ఆశ్చర్యంతో అలా చూస్తుండిపోయారు. వాళ్లలో ఒకడు తన మొబైల్ తీసుకుని వాటిని వీడియో తీయడం ఆరంభించాడు. ఒకామె తన వద్ద ఉన్న బైనాక్యులర్ సహాయంతో మరింత దగ్గరగా చూడటానికి ప్రయత్నం చేసింది. అలా చూసిన ఆమె నిర్ఘాంతపోయే దృశ్యం ఒకటి చూసింది. నౌక లోపల ఏవో విచిత్ర జీవులున్నాయి. అదే విషయం మిగతా వాళ్ళకి చెప్పబోతుంటే ఒక్కసారిగా ఇంజన్ వేగం పెరిగింది. దాన్నుండి వస్తున్న గాలి వేగానికి అందరూ ఊగిసలాటకు గురయ్యారు. గాలి వేగం మరింత పెరగడంతో వారు పట్టు తప్పడం జరిగి, వేసుకున్న లంకెలు ఒక్కోటి తెగుతూ ఒక్కసారిగా అందరూ శిఖరం మీద నుండి కింద పడ్డారు.

కంబోడియాలోని ఓ పురాతన ఆలయం దగ్గరలో..,

ఓ టూరిస్టు బస్ అందర్నీ ఎక్కించుకుని ఆలయం నుండి నగరంలోకి బయల్దేరింది. బస్సులో వివిధ దేశాలకు చెందిన వాళ్ళున్నారు. అందరి చేతుల్లో కెమెరాలు, ఫోన్లు ఉన్నాయి. బస్ మరింత వేగం పుంజుకుని వెళ్ళింది. టూరిస్టులో ఒకరికి ఎక్కడనుండో ఓ శంఖారావం వినిపించింది. బస్సు శబ్దం వల్ల దానిలో అంత స్పష్టత లేకపోవడం వల్ల పట్టించుకోలేదు. మరలా వినిపించింది. ఏమిటోనని కిటికీ అద్దం తీసి తల బయటకు పెట్టి చూశాడు. కొన్ని అడుగుల దూరంలో కాషాయజెండాలు కనిపించాయి. అవేంటో అర్థం కాని అతను కెమెరా సహాయంతో జూమ్ చేసి చూడాలని కెమెరాను బయటకు తీయబోయాడు. అంతే!! వేగంగా వెళ్తున్న బస్సును డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేసి ఆపాడు. అందరూ ముందు సీట్లకు గుద్దుకున్నారు. కొన్ని ఫోన్లు, కెమెరాలు కిందపడి పగిలాయి. కిటికీ దగ్గర ఉన్న వ్యక్తి అమాంతం ముందుకు పడ్డాడు. మెల్లిగా పైకి లేచి డ్రైవర్ వైపు చూసాడు. భీకరమైన ఓ ఏనుగుల గుంపు బస్సుకు ఎదురుగా నడవడం కనిపించింది. ముందుకు వస్తున్న ఏనుగుల గుంపు రెండు ముక్కలుగా చీలింది. వాటి మధ్య నుండి కొంతమంది రాజసైనికులు ఆయుధాలు పట్టుకుని నడవడం ఆరంభించారు. వారి మధ్యలో రథం మీద రాజసం కలిగిన ఓ రాజు, మొహం మీద చిన్న చిరునవ్వుతో నడుం దగ్గర ఓ ఖడ్గం పెట్టుకుని ధీరత్వం ఉట్టిపడే శిఖరంలా నిలబడి సైన్యానికి అభివాదం చేయడం గమనించాడు. అందరికీ ఈ విషయం చెబుదామని చుట్టూ చూశాడు. అప్పటికే అందరూ

ఆశ్చర్యపోయిన కళ్ళతో అలా శిలలుగా బిగిసుకుని పోయారు. అందరూ వీడియోలు, ఫోటోలు తీయడం ఆరంభించారు. డ్రైవర్ భయంతో బస్సును వెనక్కి తిప్పడం ఆరంభించాడు.

టూరిస్టుల్లో ఒక భారతీయుడు కూడా ఉన్నాడు. అతని వద్ద ఉన్న కెమెరాను జూమ్ చేసి ఆ రాజు అభివాదం చేస్తుంటే వీడియో తీస్తూ, కెమెరాను మరింత బిగుతుగా పట్టుకున్నాడు. అతని రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ఆ రాజు కుడిచేతిలో ఉన్న శంఖాన్ని మరోసారి పూరించాడు. ఆ శబ్దం అతని చెవులను చేరి, కళ్ళనుండి నీరుగా కారింది. ఈలోపు డ్రైవర్ వెనక్కి తిప్పే క్రమంలో బస్సును కుదిపాడు, అతను అదుపు తప్పి ముందుకు పడ్డాడు. బస్సు పూర్తిగా వెనక్కి తిరిగింది. అతను పైకి లేచి చూశాడు ఆశ్చర్యంగా ముందు కనిపించిన దృశ్యాలు లేవు, మరలా యథాస్థితికి మారింది. డ్రైవర్ అనుమానంగా వెనక్కి చూశాడు. పొడవాటి రోడ్డు తప్ప మరేదీ లేదు. బస్సును పక్కకు ఆపాడు. అందరూ బస్సు నుండి బయటకు దిగారు. ఎండకు అడ్డుగా చేతులు పట్టుకుని అటుగా చూశారు. అందరికీ అక్కడేం జరిగిందో అర్థం కాలేదు.

భారతీయుడు మాత్రం సూర్యుడి వేడిని సైతం లెక్కచేయకుండా అటుగా చూస్తూనే వున్నాడు. అతని మొహంలో ఒకరకమైన ఉద్వేగం, శరీరంలో గగుర్పాటు, కళ్ళలో భక్తి భావం నిండి ఉంది. తన కళ్ళనుండి ఆనంద భాష్పాలు కారటం కూడా అతను గమనించలేదు. అతని చేతిలో ఉన్న కెమెరా వంక చూసి దానిని కళ్ళకద్దుకుని, ముద్దు పెట్టుకున్నాడు.

అతని పరిస్థితి గమనించిన ఒక బ్రిటీషర్, 'ఆ రాజు ఎవరూ..!? ఆ సైన్యం ఆ జెండాలు చూస్తుంటే అతను ఓ గొప్ప రాజులా వున్నాడు' అనడిగాడు.

అతను నవ్వుతున్న కళ్ళతో బ్రిటీషర్ వైపు చూసి, "అతనే మా ఛత్రపతి శివాజీ మహారాజ్...." అని బిగ్గరగా అరిచాడు.

దక్షిణ సూడాన్, బాండింగి నేషనల్ పార్క్..,

ఫారెస్ట్ ఆఫీసర్లు ట్యాగ్ వేసిన ఓ చీతాపిల్ల కోసం వెతుకుతూ పార్కు పడమర భాగం చేరారు. వారి చేతిలో ఉన్న ట్యాగ్ డిటెక్టర్ సరిగా పని చేయకపోవడం వల్ల చీతాపిల్ల జాడ తెలియడం లేదు. వచ్చినవారు ఒక్కొక్కరు ఒక్కోవైపు వెళ్లి వెతకడం ఆరంభించారు. ఒక ఆఫీసర్ పొదల మధ్య వస్తున్న విచిత్రమైన శబ్దాలు విని అందర్నీ ఒకేసారి పిలిచాడు. ఒక్కరు తప్ప మొత్తం అందరూ ఆ పొద చుట్టూ చేరి చేతిలో వలలు పట్టుకుని సిద్ధంగా ఉన్నారు. ఒకతను మాత్రం ట్రాంక్విలైజర్ షాట్‌తో సిద్ధంగా ఉండి, తల్లి చీతా కోసం చూశాడు. ఈలోగా పొదల మధ్య నుండి చిన్న వెలుగు వచ్చింది. ఆ వెలుగేంటో అర్థం కాక ఒకరి మొహం మరొకరు చూసుకున్నారు. ఒకతను తన బ్యాగునుండి కొన్ని మాంసం ముక్కలు పొద బయట వేశాడు. పొదల మధ్య కదలిక ఆగింది. ఒకతను చేతికి సేఫ్ గ్లోవ్ వేసుకుని పొదల మధ్య నుండి చేతులు పోనిచ్చి పిల్ల

కోసం అటూఇటూ ఆడించాడు. చేతికేదో తగిలినట్టు అనిపించి గట్టిగా పట్టుకుని అమాంతం బయటకు లాగాడు. చుట్టూ వున్న ముగ్గురూ అతని చేతిలో ఉన్న జీవిని చూసి గావుకేకలు పెట్టారు. అతని చేతిలో మూడడుగుల పొడవుతో సగం మనిషి శరీరంతో మరొక సగం సింబియాటిక్ హ్యూమనాయిడ్ టెక్నాలజీతో ఉంది. పట్టుకున్న అతనికి కూడా భయం వేసి దానిని వదిలేశాడు. వారి మధ్యనుండి ఆ జీవి పరుగు తీస్తూ గాలిలోకి మాయమైంది.

చీతా తల్లి కోసం చూస్తున్న అతను వెనక్కి తిరిగి, 'ఏమైంది..!? చీతా తల్లి వచ్చిందా? ఎక్కడ?' అనడిగాడు. వాళ్లలో కళ్ళలో ఉన్న ఆశ్చర్యం గమనించి, 'ఏమైంది?'' అనడిగాడు.

బెర్ముడా.,

తెల్లవారింది, వశిష్ఠ వెళ్లి అందరిని నిద్రలేపాడు. వశిష్ఠ మొహం చూసిన వాళ్ళకి వశిష్ఠ సరిగా నిద్రపోలేదని అర్థమైంది. లోపల ఉన్న విరించి కూడా నిద్రలేచాడు.

లేవడంతోనే, "ఏమైంది వశిస్ఠా..!? ఆ పాడ్ ఫ్రీక్వెన్సీ డిటెక్ట్ అయ్యిందా?" అనడిగాడు.

వశిష్ఠ, "ఇంకా లేదు, నేను కూడా దాని గురించే చూస్తున్నాను. ఈలోపు మీరు ఫ్రెషప్ అవ్వండి" అన్నాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS